క్లుప్తంగా

మీర్‌పేటలో నాకాబందీ

మీర్‌పేట: రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి ప్రధాన కూడళ్లలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని 32 వాహనాలను గుర్తించి సీజ్ చేశామని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే అనుమానితులను కూడా సోదా చేశామని పేర్కొన్నారు. నిత్యం ఒక ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ చేపడుతున్నామని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. బోనాలు, ఇతర పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాకాబందీలో డీఐ గౌరీనాయుడు, ట్రాఫిక్ సీఐ శ్రీశైలం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మైలార్‌దేవ్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలో ఆనంద్‌రెడ్డి(41) తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతికూల వాతావరణంతో విమానాల మళ్లింపు

శంషాబాద్: భారీ వర్షం.. ప్రతికూల వాతావరణం కారణంగా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సిన పలు విమానాలను దారి మళ్లించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షంతో రాంచి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన ఐఎక్స్–2674 విమానం మధ్యాహ్నం 3.35 గంటలకు ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ఇక్కడి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఏటీసీ దానిని విజవాడ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. అదే విధంగా గోవా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన ఇండిగో 6ఈ–117 విమానం విమానాన్ని కూడా రాత్రి 7 గంటల సమయంలో విజయవాడకు మళ్లించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా–2519 విమానం కూడా ప్రతికూల వాతావరణం కారణంగా బెంగళూరుకు మళ్లించారు. వర్షం కారణంగా విమానాల రాకపోకలకు సంబంధించి సంబంధిత ఎయిర్‌లైన్స్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని ప్రయాణాన్ని సులభతరం చేసుకోవాలని ఎయిర్‌పోర్టు వర్గాలు ఓ ప్రకటనలో సూచించాయి.

సమష్టి సహకారంతో అభివృద్ధి

చేవెళ్ల: ప్రజల్లో వచ్చే మార్పుతోనే పట్టణ అభివృద్ధికి నాంది పడుతుందని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని 12 గ్రామాల విలీనంతో 6 నెలల క్రితం ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. టీచర్స్ కాలనీ, కమలానగర్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా చాలా అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొరుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నిర్మాణానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకొని, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

తండావాసుల దీక్ష విరమణ



నిమ్మరసం తాగి దీక్ష విరమిస్తున్న కొండకల్ తండావాసులు

శంకర్‌పల్లి: తమ భూముల కోసం 188 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను కొండకల్ తండావాసులు శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ క్రిష్ణ, నాయకుడు రాజు తండావాసులకు నిమ్మరసం ఇచ్చి, దీక్ష విరమింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సమస్యలపై అపర్ణ కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి, తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇరువర్గాలు గతంలో పరస్పరం నమోదు చేయించుకున్న పోలీసు కేసులు, తదితర అంశాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు. గతంలో అపర్ణ కంపెనీకి సహకరించినట్లుగానే, భవిష్యత్తులోనూ తమ సహకారం ఉంటుందని సంయుక్త ప్రకటన చేశారు.

బాల్యానికి భరోసా..



పిల్లల ఎత్తును కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో అభ్యసనం

- పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- పౌష్టికాహార లోపం నివారణే లక్ష్యం
- నిరంతరం పర్యవేక్షణ.. పోషకాల అందజేత

మహేశ్వరం: చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. అందులో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పోషకాలను అందించి, బాల్యానికి భరోసా ఇస్తున్నాయి. ప్రతి నెల పిల్లల బరువు, ఎత్తు కొలతలను లెక్కిస్తూ.. పౌష్టికాహార లోప నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఫలితంగా పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ఒకప్పుడు ఎక్కువ మంది పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడేవారు. దాంతో ఎదుగుదల లోపించి, ఆయాసం, నీరసం తదితర లక్షణాలతో కనిపించేవారు. చదువుపై శ్రద్ధ చూపలేకపోయేవారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదలను నిత్యం పర్యవేక్షించడం, ఆకు కూరలు, పప్పు, కోడిగుడ్లతో కూడిన పౌష్టికాహారంను అందజేస్తున్నారు. దీంతో రేపటి పౌరులు ఆరోగ్యంగా ఎదుగుతున్నారు.

గ్రోత్‌మానిటరింగ్‌తో తగ్గిన సమస్య

ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్ మండలాల్లోని మొత్తం 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో గర్భిణులు– 1,212, బాలింతలు– 94,307, నెలలు–7 సంవత్సరాలలోపు చిన్నారులు– 11,156, ప్రీ స్కూల్ చిన్నారులు– 3,178, వీరిలో పోషణలోపం స్థితిలో– 586 మంది, తీవ్ర పోషణ లోపంతో– 534 మంది, అతి తీవ్ర పోషణ లోపంతో– 52 మంది చిన్నారులు ఉండగా.. ముగ్గురు గుండె సంబంధిత రోగంతో బాధపడుతున్నారు. ప్రతి కేంద్రం పరిధిలో గ్రోత్‌మానిటరింగ్ చేస్తున్నారు. దీని కోసం పిల్లల ఎత్తు, బరువు చూడటానికి పరికరాలను ప్రభుత్వం అందించింది. ప్రతి సెంటర్‌లో టీచర్ తన పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు తూచి వివరాలను ఐసీడీఎస్ యాప్‌లో నమోదు చేసి, ఉన్నతాధికారులకు తెలియజేయాలి. వయసుకు తగిన బరువు, ఎత్తు లేకపోతే అదనంగా పౌష్టికాహారంను పిల్లలకు అందిస్తారు. ప్రభుత్వం ప్రతి నెల సరఫరా చేసే గుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యానికి భరోసాగా నిలుస్తాయని పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

శిశు మరణాల తగ్గింపునకు కృషి



పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బలహీనంగా వారిని గుర్తించి తగిన పోషకాలు అందజేసి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాం. బాలామృతం ప్లస్‌ను అందజేస్తున్నాం. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి శస్త్రచికిత్స చేయించాం. ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 24 మంది వివిధ కారణాలతో మరణిస్తున్నారు. ఆ రేటును తగ్గించేందుకు కృషి చేస్తున్నాం.

– శాంతిశ్రీ, సీడీపీఓ, ఐసీడీఎస్, మహేశ్వరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని లెనిన్‌నగర్ ఏఈ ఎస్.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ అల్మాస్‌గూడ ఫీడర్ పరిధి సీవైఆర్ కమాన్, ఆర్‌బీ రెడ్డికాలనీ, ఎస్‌బీఆర్‌కాలనీ, ఎంజేఆర్ కాలనీ, అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్, అల్మాస్‌గూడ వివేకానంద, అల్మాస్‌గూడ హనుమాన్ టెంపుల్, హరిత హోమ్స్, సాయిప్రభు హోమ్స్, శివనారాయణపురం, వెంకటేశ్వరకాలనీ, వరలక్ష్మికాలనీ, మహాలక్ష్మీనగర్, సమతానగర్, సీతాహోమ్స్ ఫేజ్–4, బడంగ్‌పేట అంగన్‌వాడీ, బడంగ్‌పేట ఎక్స్ రోడ్డులో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ శ్రీశ్రీ హోమ్స్ ఫీడర్ పరిధి మధురానగర్, ఇందిరాహిల్స్, శ్రీహిల్స్, శ్రీశ్రీ హోమ్స్, న్యూ తిరుమలనగర్, టెలికాం కాలనీ, బృందావన్ కాలనీ, వినాయకహిల్స్ ఫేజ్– 2,3, తిరుమలనగర్‌లలో మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గౌరెల్లి ఫీడర్ పరిధి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ కొత్తపేట, లక్ష్మీనగర్, మోహన్‌నగర్, న్యూ మారుతీనగర్, విద్యుత్‌నగర్ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ మోర్ ఫీడర్ కింది ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ హరిపురికాలనీ, ఖిల్లా మైసమ్మ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ వాసవీకాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు. 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. 11కేవీ యాదవనగర్ ఫీడర్ పరిధి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ పెద్దఅంబర్‌పేట పారిశ్రామిక ప్రాంతం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు



చేవెళ్ల: ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యురాలు



కేశంపేట: విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్

చేవెళ్ల: మండలంలోని దేవరంపల్లి హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎన్కేపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వనం మాధవిలక్ష్మీకాంత్‌రెడ్డి దంపతులు రూ.2 లక్షల విరాళం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సమష్టిగా ఉండి ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరహరిరెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, రాజు, నరేందర్‌రెడ్డి, ఆనంద్‌చారి, గోవింద్‌రెడ్డి, ముకంద్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని లింగంధనలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మాజీ సర్పంచ్ ఎడ్మ రాంరెడ్డి రూ.1,02,116 విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడయ్య, చిన్న రామస్వామి, కృష్ణయ్య, జంగయ్య, కృష్ణ, సురేందర్, భాస్కర్, బాలస్వామి, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందాం

కొత్తూరు: అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉండాలని కుల అసమానతల నిర్మూలన సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన ఆధ్వర్యంలో మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం రాత్రి కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... నాడు కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నేటికి నలభై ఏళ్లు పూర్తయినట్లు చెప్పారు. దళితులపై ఆరోజు జరిగిన ఘటనతోనే ఎస్సీ, ఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. పీడితులు ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనకృష్ణ, నాయకులు చక్రవర్తి, లక్ష్మయ్య, నరేష్, బబ్లు, భిక్షపతి, కౌసల్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నినదిస్తున్న నాయకులు

చినుకు పడితే చిత్తడే

చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి మండలంలోని ఎల్గొండగూడ నుంచి వీరాపూర్ వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– షాబాద్



విద్యార్థులకు అవగాహన



శంషాబాద్: శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో సమావేశమై వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. రైతులకు వివిధ రకాల సేద్య పద్ధతులను తెలియజేశారు. పెద్ద సంఖ్యలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైటెక్‌సిటీ మైండ్ స్పేస్ సహకారంతో సీఆర్ఎస్ ఫండ్‌తో స్టీమ్ (సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మెథమెటిక్స్) ల్యాబ్‌లో 6వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లతో పాటు స్టేషనరీ సామగ్రిని అందజేశారు.

బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



లక్ష్మీగూడలోని దేవాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడికే రాజు తెలిపారు. లక్ష్మీగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద బోనాల ఏర్పాట్లు భారీ స్థాయిలో చేపట్టామన్నారు. ఈ నెల 20వ తేదీన భక్తులు తమ బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించాలని కోరారు. తొట్టెల ఊరేగింపు, బోనాల ర్యాలీలకు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

అధ్వానంగా రాయపోల్ రోడ్డు

మరమ్మతులు చేపట్టండి: బీజేపీ

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామ ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు సమస్య గురించి ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్, కార్తీక్, శివ, చంటి, విజయ్, బాస్కర్, నరేష్, శంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సూచించారు. ఇది సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సంగి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డా.చందన, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.జహేదా బేగం, అధ్యాపకులు ఇంతీయాజుద్దీన్ ఫరూఖీ, శ్రీహరిరెడ్డి, శ్రీదేవి, గోపాల్, చెన్నోజి, నరేందర్ రెడ్డి, ఉపేందర్, కుమార్, రవళిక, సన్నీ, సుమతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధిలో భాగస్వాములవ్వండి



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో రూ.41.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామీణ రోడ్లను అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలు ఎప్పటికప్పుడూ అధికారులను అడిగి తెలుసుకొని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ, నాయకులు పాపారావు, మనీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటిలో చిక్కుకున్న బస్సు

- సత్వరమే స్పందించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు
- చాకచక్యంగా బయటకు తీసుకొచ్చిన వైనం
- ప్రయాణికులు సురక్షితం



శివరాంపల్లి రోడ్డుపై వరదనీటిలో ఆగిన బస్సుకు మరమ్మతు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

రాజేంద్రనగర్: ప్రయాణికులతో వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సును రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి బయటికి తీసుకొచ్చారు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్‌లో భారీ వర్షం కురిసింది. అంతకుముందే కురిసిన వర్షానికి వరదనీరంతా రోడ్లపైకి చేరింది. శివరాంపల్లి నుంచి ఆరాంఘర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ప్రజా భవన్ వద్ద వరదనీరు పూర్తిగా నిలిచిపోయింది. ఈ సమయంలో రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బహదూర్‌పురా నుంచి శంషాబాద్ వైపు వెళుతూ వరదనీటిలో చిక్కుకుంది. వరదనీటిలో పూర్తిగా చిక్కుకున్న ఈ బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. వరదనీటిలో వెళుతూ ఒక్కసారిగా వాహనం నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ముందుకు కదలకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాడు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు ఈ విషయాన్ని తెలుసుకొని తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో ట్రాఫిక్ లిఫ్ట్ వాహనాన్ని తెచ్చి బస్సును ఆరాంఘర్ వైపు తీసుకొచ్చారు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరారు. పలువురు ప్రయాణికులు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులను అభినందించారు.

రసీదు లేకుండా విక్రయాలు



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శిరీష

- పురుగు మందులు అమ్ముతున్న ఫర్టిలైజర్ నిర్వాహకుడు
- ప్రశ్నించిన రైతులపై దురుసు ప్రవర్తన
- ఆగ్రహంతో రోడ్డుపైన బైఠాయించిన కర్షకులు
- స్పందించిన వ్యవసాయ అధికారి

కేశంపేట: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల సమయంలో రసీదులు తప్పనిసరి అని పదేపదే వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నా కొందరు ఫర్టిలైజర్ నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్లులు లేకుండా ఎరువుల విక్రయాలు చేస్తుండగా ప్రశ్నించిన రైతులపై షాపు యజమాని దురుసుగా ప్రవర్తించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేశంపేట గ్రామానికి చెందిన చిర్ర యాదయ్య, కడియల అంజయ్య కలుపు మందు కోసం స్థానికంగా ఉన్న శ్రీనివాస నాగలి సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లారు. అక్కడ నానో డీఏపీ లీటర్ బాటిల్ కొనుగోలు చేశారు. మిగతా షాపుల కన్నా అధికంగా తీసుకున్నట్లు గుర్తించి, నిర్వాహకుడిని గట్టిగా నిలదీశారు. దీంతో షాపు యజమాని రైతులతో దురుసుగా ప్రవర్తించాడు. మిగతా షాపుల కన్న అధికంగా డబ్బులను వసూళ్లు చేస్తూ దబాయించడంపై కర్షకులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. సరైన సమాధానం రాకపోవడంతో రోడ్డుపైన బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

దుకాణం మూసివేత

సరైన బిల్లును ఇవ్వకుండా రైతుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తూ రోడ్డు పైన బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి మండల వ్యవసాయ అధికారి శిరీష వచ్చి రైతులతో మాట్లాడి వివరాలను సేకరించారు. బిల్లులను పరిశీలించిన ఆమె దుకాణ నిర్వాహకుడితో మాట్లాడి ఇలాంటి బిల్లులతో ఎంత మందికి విక్రయించారో వివరాలను అందించాలని తెలిపారు. రైతుల సూచనల మేరకు దుకాణాన్ని మూసి వేయించారు. అనంతరం పోలీసులు రైతులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

సంతకాలు తప్పనిసరి

ఫర్టిలైజర్ దుకాణంలో వ్యవసాయ అధికారులు సంతకం చేసిన బిల్లులు మాత్రమే ఉంటాయి. కానీ షాపు నిర్వాహకుడు కంప్యూటర్ ద్వారా బిల్లులను అందిస్తున్నాడు. బిల్లుపైన జీఎస్టీ నంబర్ కూడా లేకపోవడం గమనార్హం. నిర్వాహకుడి సంతకంతో పాటుగా కొనుగోలు చేసిన రైతు సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ శుక్రవారం రైతుకు ఇచ్చిన బిల్లులో ఇవేవి లేవు. నిరసన కార్యక్రమంలో రైతులు రమణరెడ్డి, సాజిద్, రాంచందర్, రవి, సతీష్, శేఖర్‌యాదవ్, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.